# అభిమాని

"రేఖా... రేఖా..." పెద్దగా పిలుస్తూ లోపలకు వచ్చిన రవిచంద్రని చూసి చేతిలోవున్న పుస్తకాన్ని పక్కన పెడుతూ "ఏమిటా రేఖలు... ఐమీన్ కేకలు...!" అనడిగింది సురేఖ చిరునవ్వుతో.

"ఆంటీ వాళ్ళంతా ఇందాక బయటకు వెళ్ళటం చూశాలే. మరి నువ్వెక్కడో పరధ్యానం పరదాచాటున ఉంటూంటావుగా... అందుకని కొంచెం సౌండ్ పెంచా!"

అతని వేపు పరిశీలనగా చూసి "ఎందుకో ఆనందంగా ఉన్నట్లున్నావ్‌గా... సంగతేమిటి?" అంది.

"అవును. మామూలు ఆనందం కాదు. మహదానందంగా ఉంది! నాకు సైతం ఓ అభిమాని!" అంటూ షర్టు జేబునుండి ఒక కవరుతీసి పైకెగురవేసి పట్టుకుని పెదవులకానించుకున్నాడు మురిపెంగా.

"ఏమిటీ...! ఎప్పుడో మూడునెలల క్రిందట పబ్లిష్ అయిన కథకి రెస్పాన్స్ ఇప్పుడొచ్చిందా...! ఎవరో ఆ ట్యూబ్‌లైట్ మహాశయుడు...?" నవ్వుతూ అడిగింది సురేఖ.

"ట్యూబ్‌లైట్ అని ఎవరైనా అంటే, అది కాంప్లిమెంటుగానే అనుకోవాలని నా ఉద్దేశ్యం! లేటయితేనేం... బ్రైట్‌కదా! అది ముఖ్యం! ఉత్తరం రాసింది అతను కాదు... అందమైన, చదువుకున్న పద్దెనిమిదేళ్ళ అమ్మాయి! పేరు కూడా అందమైందే... అపూర్వ!" మెరిసే కళ్ళతో ఆనందంగా చెప్పాడు.

"ఓహో... ఉత్తరంతో పాటూ ఫోటో, బయోడేటా కూడా వచ్చాయా?" ఆశ్చర్యాన్ని అభినయిస్తూ అడిగింది.

"ఉత్తరంలోని అందమైన అక్షరాలే అద్దాల్లా... ఆ అమ్మాయి రూపురేఖలను చూపిస్తోంటే, ఫోటోతో పనేముందీ...! ఈ ఉత్తరం చదివిచూడు... నీకే తెలుస్తుంది ఆ అమ్మాయి భావాలు ఎంత ఆధునికమైనవో... మనసు ఎంత సున్నితమైందో...!"

చేతిలోని కవరును సురేఖ ఎదురుగా వున్న టీపాయ్ మీద పెట్టాడు. "అమ్మ చిన్న పని చెప్పింది. ప్రక్క వీధిలోని ఫాన్సీస్టోర్సుకి వెళ్ళి మళ్ళీ వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

హుషారుగా విజిలేసుకుంటూ గాలిలో తేలిపోతున్నట్లుగా వెళ్తున్న అతని వేపు వింతగా చూసింది.

అతను అంతగా ఆనందించటానికి కారణం ఉంది. మూడు నెలల క్రిందట ఒక వీక్లీలో అతను రాసిన మొదటి కథ అచ్చయింది. ఆరోజు రవిచంద్ర చాలా సంతోషంగా సురేఖ అభిప్రాయం తెలుసుకోవాలని వచ్చాడు. అభినందించటం మాట అటుంచి, సురేఖ అతని కథను తీవ్రంగా విమర్శించింది.

ఆ కథలో... హీరో అమర్ ప్రముఖ గాయకుడు. ప్రేమలత అనే ఆమెకి అమర్ అన్నా, అతని పాటలన్నా పిచ్చి అభిమానం! ఆమె ఒక పత్రిక ఆఫీసులో పని చేస్తుంటుంది. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఒకసారి వృత్తిరీత్యా అమర్‌ని ఇంటర్వ్యూ చేసే అవకాశం రావటంతో ఆమెకి అమర్‌తో పరిచయం కలుగుతుంది. ఆ సంవత్సరం అమర్ భార్య యాక్సిడెంట్‌లో చనిపోతుంది. అప్పుడు ప్రేమలత అతనికి దగ్గరవుతుంది.

తనకి పెళ్ళికాక ముందునుండీ అమర్ పట్ల వున్న ప్రేమాభిమానాల గురించీ, పెళ్ళయ్యాక భర్త స్పర్శని భరించలేక శరీరం మీద పెట్టుకున్న వాతల సంగతీ... ప్రేమలత అమర్‌కి విపులంగా చెబుతుంది. ఆమె ప్రేమకి చలించిపోయిన అమర్ ఆమెను భార్యగా స్వీకరిస్తాడు.

క్లుప్తంగా కథ ఇతివృత్తం అది!

"కథ ఎలా ఉంది?" అని ఆసక్తిగా అడిగిన రవిచంద్ర ప్రశ్నకి సురేఖ "నాకస్సలు నచ్చలేదు" అంటూ నిర్మొహమాటంగా జవాబు చెప్పింది.

"నీకథలో నువ్వు వర్ణించినట్లుగా ప్రేమలతది అమర ప్రేమగా నాకనిపించలేదు. కేవలం అవకాశవాదంగా మాత్రమే అనిపించింది. ప్రేమలతకి భర్తతో సమస్యలుగానీ, ఇబ్బందులుగానీ వున్నట్లుగా చెప్పలేదు. అంటే... తనకంటే పై అంతస్తులో వున్న అమర్‌తో పరిచయం కలిగి పెళ్ళికి అవకాశం రాగానే... తన భర్తనీ, పిల్లల్నీ వదిలిపెట్టేయగలిగింది.

ఏమైనా సమస్యలుండి విడాకులు తీసుకోవటం సమర్థనీయంగానీ మరొకరితో ప్రేమలోపడి విడాకులు తీసుకోవటం అంటే... నిరపరాధి అయిన జీవిత భాగస్వామిని నిష్కారణంగా శిక్షించినట్లేగా... అది నేరంకాదూ...?

ప్రేమ అనేది ఎప్పుడైనా, ఎవరిపట్లనైనా అసంకల్పితంగా కలగొచ్చు అనేమాట నిజమే అయినా పెళ్ళయినవాళ్ళు ఆకర్షణలనీ, మనసు చేసే గారడీని ఎదుర్కొని వివాహబంధాన్ని గౌరవించి స్థైర్యంగా నిలబడాలి! అవునా...? ఈ విషయం నువ్వు కథలో చెప్పివుంటే బావుండేది.

ఎవరైనా ప్రముఖ వ్యక్తుల పట్లగానీ, కళాకారుల పట్లగానీ, ఎవరికైనా అభిమానం, ఆరాధనా ఉండటం సహజమే. వారిని కలుసుకోవాలనీ, పరిచయం పెంచుకోవాలనీ అభిమానులు కోరుకోవచ్చు. అంతే గానీ, తాము అభిమానించే వ్యక్తులతో జీవితాన్ని పంచుకోవాలనే ధ్యేయం, కోరికా కలిగి

ఉండటం మాత్రం సమర్థనీయం కాదుగదా? కానీ నువ్వేమో... అటువంటి ప్రేమకు అమరత్వాన్ని ఆపాదించి వర్ణించావు! అంటే అభిమానులకు రాంగ్‌డైరక్షన్ ఇచ్చినట్లేగా.

సందేశం ఇవ్వకపోయినా ఫర్వాలేదుగానీ తప్పుదారిని ఆకర్షణీయంగా, ఉదాత్తంగా చూపించటం మాత్రం మంచి పద్ధతికాదు. అవునా? ఇంకొక సంగతి, వాతలగొడవ ఏమిటీ? ఎవరైనా అలా వాతలు పెట్టుకుంటారా అసలు?" కోపంగా చూస్తూ అడిగింది.

సురేఖ దాడికి అప్పటికే డీలాపడిపోయిన రవిచంద్ర మెల్లగా గొణిగినట్లుగా అన్నాడు. "ఆ మధ్య ఒక సీరియల్‌లో చదివాను. ఇష్టంలేని వాళ్ళ స్పర్శను భరించలేని ఆడవాళ్ళు అలా చేస్తారని అనుకున్నా మరి."

సురేఖ పెద్దగా నవ్వింది.

"ఓహో... ఈ అయిడియాని నువ్వు అక్కడి నుండి కాపీకొట్టావన్న మాట! బావుంది! నేనూ అది చదివాలే! అది చదివిన ఒక పెద్దాయన గొప్పగా స్పందించి 'వాతలు పెట్టుకోవటమనేది ఎంత ఉదాత్త భావన' అని మెచ్చుకుంటూ ఉత్తరం రాస్తే, దానిని ఆ పత్రిక వాళ్ళు బాక్సు కట్టి మరీ ఆ ఉత్తరాన్ని ప్రచురించారు! ఆయన ఉద్దేశ్యమేమిటో నాకర్థం కాలేదు!

బస్‌స్టాండ్ రద్దీలోనో... మరో చోటో ఏ ఆకతాయి కుర్రాడో పొరపాటునో, బుద్ధిపూర్వకంగానో చెయ్యేస్తే... ఆడవాళ్ళు చిరాకుపడతారు. మందలిస్తారు. అంతేగానీ ఇంటికొచ్చి వాతపెట్టుకుని శరీరాన్ని శుద్ధిచేసుకోరు కదా! ఒకవేళ ఆ పెద్దాయన చెల్లెలో, భార్యో అలా చేస్తే 'అదేం మూర్ఖత్వం' అని మందలించకుండా 'ఎంత ఉదాత్తత' అని మెచ్చుకుంటారు కాబోలు! అది చదివినప్పుడే నాకు కోపం వచ్చి 'ఈ వాతల థియరీ ఏమిటి మహాశయా?' అని ఉత్తరం రాద్దామనుకున్నా. ఉత్తరం రాయాలంటే బద్ధకం కదా... అందుకని వూరుకోవాల్సి వచ్చింది... ఇదిగో ఇప్పుడు నువ్వు దొరికావు..."

సురేఖ మాటలకు మధ్యలోనే అడ్డం వచ్చి, రెండు చేతులూ ఎత్తి దండం ఎట్టి "బాబోయ్.. ఇక ఆపుతల్లీ...! నేరకపోయి నా కథ గురించి నిన్ను అభిప్రాయం అడిగాను... తప్పయింది!" అంటూ అక్కడ నుండి పారిపోయాడు.

ఆ తర్వాత రవిచంద్రని కలిసినపుడు మాటల మధ్య 'మళ్ళీ ఏవైనా కథ రాసావా?' అని యాధాలాపంగా సురేఖ అడిగింది. రాయాలనే ఉత్సాహం లేదన్నాడు. కారణం అడిగింది. "ఏ పత్రికయినా చూడు... ప్రచురింపబడిన ప్రతీకథ గురించీ ఉత్తరాల శీర్షికలో ఆ కథ మా ఇంటిల్లిపాదినీ కడుపుబ్బనవ్వించిందనో, ఈ కథ కన్నీళ్ళు పెట్టించిందనో అంటూ ఎన్నో ఉత్తరాలు కనుపిస్తుంటాయి! కానీ నా కథ గురించి ఒక్క ఉత్తరమైనా రాలేదు! అంటే... నీకేకాదు, ఏ ఒక్కరికీ కూడా నా కథ నచ్చలేదన్నమాట! పత్రికలో అచ్చవటమేకాదు, కనీసం కొంతమందికైనా నచ్చేట్లుగా రాయగలగాలి... అది నాకు చేతకాదని నిరూపణయింది. అందుకే ఇక ఆ ప్రయత్నం వదిలేసాను!" నిరుత్సాహంగా అన్నాడు.

అతని జవాబుకి సురేఖ విస్తుపోయింది. "మొదటి కథతోనే కీర్తి ప్రతిష్టలూ, అభిమానుల ఉత్తరాలూ వచ్చేస్తాయా...?! నాకు నచ్చనంతమాత్రాన ఇంకెవరికీ కూడా నచ్చలేదని ఎలా అనుకుంటావ్? చాలామందికి నచ్చే ఉండొచ్చు. చదివాక బావుందనుకుని వూరుకుంటారు గానీ పనికట్టుకుని పత్రికవాళ్ళకి తెలియచేసే వాళ్ళు చాలా కొద్దిమందే ఉంటారు. నా మటుకు నేను

కూడా అంతే. ఏ కథ అయినా నచ్చినప్పుడు ఆ మాట అనుకుని పూరుకుంటానే గానీ ఇప్పటి వరకూ ఎప్పుడూ ఉత్తరం రాయలేదు...” అంటూ అతనికి నచ్చచెప్పబోయింది.

“ఇంత ఆంధ్రదేశంలో... ఉత్తరం రాయాలనిపించేంతగా స్పందనని నాకథ ఏ ఒక్కరికయినా కలిగించలేదంటే, నేను రచయితగా ఫెయిల్ అయినట్లే... అందుకే మళ్ళీ ప్రయత్నించాలనే ఉత్సాహం రావట్లేదు...” అంటూ వాదించేసరికి సురేఖకీ విసుగొచ్చి పూరుకుంది.

ఇప్పుడు ఇన్నాళ్ళ తర్వాత ఆ కథని మెచ్చుకుంటూ ఒకరు ఉత్తరం రాసేసరికి అతనికి చాలా సంబరంగా అనిపించింది. తన కథని ఏకిపడేసిన సురేఖకి చూపించాలని ఇప్పుడు ఉత్సాహంగా పరుగెట్టుకు వచ్చాడు.

* * *

ఫాన్సీషాపులో పని పూర్తి చేసుకుని వచ్చిన రవిచంద్ర తను పెట్టిన చోట అలాగేవున్న కవరునూ, ఎటో చూస్తున్నట్లుగా కూర్చున్న సురేఖనీ గమనించి చూసి “ఏమిటీ... ఉత్తరాన్ని చదివినట్లుగా లేదే?” అనడిగాడు.

సురేఖ నిర్లిప్తంగా “ఇలాంటి ఉత్తరాల్ని చదవాల్సిన అవసరం ఉండదులే. బ్రహ్మాండంగా ఉంది నీ కథ అని రాసివుంటుంది. అంతేగా! అయినా అదేదో సామెతలాగా ఎప్పుడో అచ్చయిన కథ గురించి ఇప్పుడు ఉత్తరం రావటం ఏమిటో...” అంది.

“ఇంత లేటుగా ఉత్తరం రాయటానికి కారణం ఏమిటో తెలుసా...? ఆ అమ్మాయికి అసలు వీక్లీ చదివే అలవాటు లేదట. ఏదయినా కథ చదవాలని ఎప్పుడైనా మొదలుపెడితే పూర్తిచేసే ఓపిక ఉండదట! అలాంటిది మొన్న తన ఫ్రెండింటికి వెళ్ళినప్పుడు వాళ్ళింట్లో కనిపించిన పాతవీక్లీని యధాలాపంగా తిరగేస్తూ... నా కథ చదవటం మొదలు పెట్టిందట. ఏకబిగిని తలెత్తకుండా చదవటమే కాకుండా ఆ వీక్లీని ఇంటికి తెచ్చుకుని మళ్ళీ మళ్ళీ చదివానని రాసింది!” అన్నాడు రవిచంద్ర.

సురేఖ పెద్దగా నవ్వి... ఏదో అనబోయి మళ్ళీ విరమించుకుంది.

“నువ్వు ఏం అనదలచుకున్నా నిరభ్యంతరంగా అనొచ్చని చెప్పాగా... నేనేం ఫీలవను! నిజం!” అంటూ ఆ కవరులోని కాగితాల్ని బయటకు తీశాడు. “ఉత్తరం ఎంతబాగా రాసిందో నీకే తెలుస్తుంది... కొన్ని వాక్యాల్ని చదువుతా... విను” అని అక్కడక్కడా చదివాడు.

“మీ కథ చదువుతుంటే... ఒక్కొక్క చుక్కగా తియ్యని తేనె నేరుగా మనసు పొరలలోకి జారిపడుతున్నట్లయి... కథ ముగించేసరికి మనసు ఒక మధుకలశమై తొణికిసలాడిన మధురానుభూతి కలిగిందంటే నమ్మండి!

సంభాషణల ద్వారా అక్కడక్కడా ప్రేమ గురించి మీరిచ్చిన నిర్వచనాలు... నిజంగా మనసు అరలో దాచుకోదగ్గ మంచి ముత్యాలే... అసలు మీ శైలి....” అతని మాటలకు మధ్యలోనే అడ్డం వచ్చింది.

“ఇక చాలు... ఆపు. అతిశయోక్తి అలంకారాలు ఆ అమ్మాయి కలం నుండి ఆశువుగా జాలువారతాయని అర్థమైపోయింది. నువ్వు ఫీలవనని భరోసా ఇచ్చినాగానీ కామెంట్ చేయటం నాకిష్టంలేదు. అలాగని ఏమనకుండా మౌనంగా వినటమూ కష్టంగానే ఉంది మరి! ఆ ఉత్తరాన్ని నువ్వే మళ్ళీ మళ్ళీ చదువుకుని ఆనందించుగానీ నన్నొదిలెయ్...!” ఫక్కున నవ్వుతూ రెండు చేతులూ జోడించింది సురేఖ.

"సరే. నీ ఇష్టం" అంటూ ఆ కవరును జేబులో పెట్టుకుని రవిచంద్ర వెళ్ళిపోయాడు.

* * *

సురేఖ, రవిచంద్రులవి ప్రక్క ప్రక్క ఇళ్ళు. సురేఖ వాళ్ళది సొంత ఇల్లు. ఆ ప్రక్కింటికి రవిచంద్రా వాళ్ళు మూడు సంవత్సరాల క్రితం అద్దెకు వచ్చారు. అప్పటి నుండీ రెండు కుటుంబాల మధ్యా మంచి స్నేహం ఏర్పడింది. సురేఖా, రవిచంద్రల మధ్య ఏర్పడిన స్నేహాన్నీ, చనువునీ గమనించిన ఇరుకుటుంబాల పెద్దలకీ వాళ్ళకి పెళ్ళి చేస్తే బావుంటుందనే ఆలోచన కలిగింది. ఆ సంవత్సరమే రవిచంద్ర ఆ వూళ్ళోనే ఒక కంపెనీలో మంచి జాబ్‌లో స్థిరపడ్డాడు. సురేఖ డిగ్రీ ఫైనలియర్‌కి వచ్చింది.

* * *

టేబుల్ ముందు కూర్చుని సీరియస్‌గా రాసుకుంటున్న రవిచంద్రని "ఓహో... అభిమాని కలిగించిన ఉత్సాహంతో రెచ్చిపోయి కథలు రాసేస్తున్నావా...?" అంటూ చిరునవ్వుతో పలుకరించింది సురేఖ.

టేబుల్‌కి అటు పక్కనున్న కుర్చీని లాక్కుని కూర్చుంది.

రవిచంద్ర గట్టిగా నిట్టూర్చాడు. "మొన్న పత్రికాఫీసు వాళ్ళు నాకు రీడైరెక్టు చేసిన ఆ అమ్మాయి ఉత్తరంలో అడ్రసులేదు. కె.అపూర్వ, వరంగల్ అని మాత్రమే ఉంది. నేను కాలేజ్‌లో చదువుకున్నప్పటి ఫ్రెండ్స్ ముగ్గురు నలుగురు వరంగల్‌లో ఉన్నారు. ఫోను నెంబర్స్ తెలియవుగానీ వాళ్ళ అడ్రసులున్నాయి నా దగ్గర. వాళ్ళకి తెలిసిన వాళ్ళలో గానీ, తెలిసినవాళ్ళ ద్వారాగానీ కె.అపూర్వ అనే కాలేజి అమ్మాయి గురించి వాకబుచేసి అడ్రసు తెలుసుకోమని ఉత్తరాలు రాస్తున్నాను."

సురేఖ ఒక క్షణం అతని వేపు అయోమయంగా చూసింది.

"నువ్వు చెప్పింది నాకేం అర్థం కాలేదు. ఆ అమ్మాయి అడ్రసు నీకెందుకూ?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఎందుకోగానీ ఆ అమ్మాయిని కలుసుకోవాలని మరీ మరీ అనిపిస్తోంది. తనేమో అడ్రసు ఇవ్వలేదు. వీక్లీలు చదివే అలవాటు ఇంతకు మునుపు లేకపోయినా గానీ ఇకనుండీ నా కథలు వస్తాయేమోనని అన్ని వీక్లీలు చూస్తుంటాననీ, ఈ సారి నాకథ ప్రచురింపబడినప్పుడు అభినందించటానికి తనే స్వయంగా వస్తాననీ రాసింది. కానీ అన్నాళ్ళు వేచి ఉండాలంటే... కష్టంగా అనిపిస్తోంది. వీలైనంత తొందరగా తనని కలుసుకోవాలనే ఆరాటం రోజు రోజుకీ పెరిగిపోతోంది."

కళ్ళు విప్పార్చుకుని తనవేపే చూస్తూ మౌనంగా వున్న సురేఖని "ఏమిటాలోచిస్తున్నావ్?" అనడిగాడు.

"ఇన్నేళ్ళ స్నేహంలోనూ నీలో ఇంత పిచ్చితనం ఉందనే విషయాన్ని తెలుసుకోలేక పోయానేమిటా అని ఆలోచిస్తున్నాను" నిట్టూరుస్తూ అంది.

"నీకు పిచ్చితనంగా అనిపిస్తోంది. నాకేమో ప్రేమ అనిపిస్తోంది. అందుకేనేమో ప్రేమా, పిచ్చీ ఒకటేనని అన్నారెవరో! ప్రేమనేది ఎపుడు, ఎందుకు, ఎవరిమీద కలుగుతుందో చెప్పలేమని ఎందుకన్నారో కూడా నాకిప్పుడు అనుభవ పూర్వకంగా అర్థమైంది!"

"నువ్వేం మాట్లాడుతున్నావో... నీ ఉద్దేశం ఏమిటో నాకేం అర్థం కావటంలేదు!"

"నిజం చెప్పాలంటే... నా పరిస్థితి నాకే విచిత్రంగా అనిపిస్తోంది! ఒక్క ఉత్తరంతోనే ఆ అమ్మాయి నా మనసును ఇంతగా ఆకట్టుకోవటం నిజంగా ఆశ్చర్యంగానే ఉంది! నా ఆలోచనలూ, భావాలూ అన్నీ ఆ అమ్మాయితో సరిగ్గా సరితూగుతాయనిపిస్తోంది. ఆ అమ్మాయితో జీవితాన్ని పంచుకోగలిగే అవకాశం గానీ కలిగితే... అంతకు మించిన అదృష్టం మాత్రం మరొకటి ఉండదు."

సురేఖ అతనివేపు కోపంగా చూసింది.

"నీకేమైనా మతిపోయిందా? ఆ అమ్మాయి ఎవరో, ఏమిటో తెలియదు. పెళ్ళయిన అమ్మాయేమో అదీ తెలియదు. అయినా నీ ఊహలేమో పెళ్ళివరకూ వెళ్ళిపోతున్నాయి! అసలు నీకిష్టం అయినంత మాత్రాన ఆ అమ్మాయికీ ఇష్టం ఉండాలనేం ఉందీ?"

"నువ్వా ఉత్తరం చదవలేదు కాబట్టి నీకర్థం కావటం లేదుగానీ... ప్రతీ అక్షరంలోనూ నాపట్ల ఆ అమ్మాయికి వున్న ఇష్టం స్పష్టంగా తెలిసిపోతోనే ఉంది! ఆ అమ్మాయి పెళ్ళికాని టీనేజ్ అమ్మాయని నేను ఖచ్చితంగా చెప్పగలను. పదహారూ, ఇరవై సంవత్సరాల మధ్య వయసున్న అమ్మాయిల మనసులో ఒక విధమైన ఆర్ధ్రత ఉంటుంది. తనకు నచ్చిన కళ పట్ల అమితంగా స్పందించటం... ఆ కళాకారులకు తమ అభిమానాన్ని, ఆరాధననీ తెలియ చేయటం... ఆ వయసు వాళ్ళే ఎక్కువగా చేస్తుంటారు. పెళ్ళవగానే చాలా మందికి భర్త, పిల్లలూ లోకమైపోయి కళలపట్ల స్పందన తగ్గిపోతుంది. చాలా కొద్ది మందికి మాత్రమే నలభై ఏళ్ళు వచ్చినా మనసులో పదహారేళ్ళ పచ్చదనం, ఆర్ధ్రతా అలా ఉండిపోతాయి. అలాగే మరికొందరికి ఇరవై ఏళ్ళకే నలభై వయసువాళ్ళ ఆరిందాతనం ముందుగానే వచ్చేస్తుంది. అంటే... నీలా అన్నమాట" నవ్వుతూ అన్నాడు.

"నువ్వన్నట్లుగా... నాకు ముందుగా వచ్చేసిన ఆరిందాతనంతోనే నీకో సలహా ఇవ్వాలనిపిస్తోంది. నువ్వు వెళ్ళాలనుకుంటున్న దారి సరియైనదిగా అనిపించటం లేదు. ఇలా అందర్నీ ఆ అమ్మాయి గురించి వాకబు చేస్తూ హైరానాపడటం కంటే... ఇంకొక కథ పబ్లిష్ అయినప్పుడు తనే స్వయంగా అభినందన సుమమాలని తీసుకుని వస్తానని రాసిందని చెప్పావ్‌గా... అందుకని అలా ట్రై చేస్తే పుణ్యమూ, పురుషార్థమూ అన్నట్లుగా రెండు విధాలుగా లాభం కలుగుతుంది. నువ్వు రచయితగా నిలదొక్కుకునే ప్రయత్నం చేసినట్లూ ఉంటుంది... నీ అభిమానినీ కలుసుకోగలుగుతావు. అవునా...?"

సురేఖ మాటలకు అతని పెదవులపైకి మందహాసం వచ్చింది.

"నీకు నా బాధ అర్థం కావటం లేదులే. ప్రేమలో పడినవాళ్ళకు మాత్రమే తెలుస్తుంది మరి! ఆ అమ్మాయి నా ప్రక్కనుంటే... రచయితగా ఎన్ని శిఖరాలైనా అధిరోహించగలననే నమ్మకం ఏర్పడిపోయింది. అందుకే ముందుగా ఈ ప్రయత్నాలు. నీకేదో అనుమానం ఉన్నట్లుందిగానీ నాకేం లేదు. ఖచ్చితంగా ఆ అమ్మాయి అడ్రసును సంపాదిస్తాను. నన్ను తన అభిమానంతో ఉక్కిరి బిక్కిరి చేసేసిన అభిమానినే జీవిత భాగస్వామిని చేసుకుంటాను." భుజాలెగురవేస్తూ ఛాలెంజింగ్‌గా అంటూన్న రవిచంద్రవేపు విస్మయంగా చూసింది.

"సరే... అలా జరిగితే మంచిదే!" నిర్లిప్తంగా అని మనసులోని భావాలను మొహంపైకి రానీయకుండా విఫల ప్రయత్నం చేస్తూ వెళ్ళిపోయింది.

సురేఖ ఎగ్జామ్స్ అయ్యాక సురేఖ తల్లీ తండ్రీ రవిచంద్రతో నిశ్చితార్థం గురించి మాట్లాడుతోంటే... సురేఖ తన కిష్టం లేదని చెప్పింది. వాళ్ళెంతగా నచ్చచెప్పబోయినా వినలేదు. సురేఖ పట్టుదల

గురించి తెలిసినవాళ్ళకు ఏం చేయాలో తోచక రవిచంద్రకే ఆ విషయం చెప్పారు. ఆ సంగతి తను చూసుకుంటానని అతను భరోసా ఇచ్చే సరికి వాళ్ళు స్థిమితపడ్డారు.

* * *

తనగదిలో కూర్చుని ఏదో వీక్లీని తిరగేస్తున్న సురేఖ దగ్గరకు వచ్చి కూర్చుని అన్నాడు "అపూర్వని ప్రేమించిన మాట నిజమే అయినా నా ప్రయత్నం ఫలించక ఇక ఆ విషయం వదిలేసానని చెప్పా కదా! పెళ్ళికి అభ్యంతరం చెప్పావటగా... అంటే ఒకసారి ప్రేమించినంత మాత్రాన ఇక నేను పెళ్ళి చేసుకోకూడదని నీ ఉద్ధేశ్యమా?"

"నిక్షేపంలా చేసుకో నిన్ను ఇష్టపడే అమ్మాయిని! నాకు ఇష్టం లేదని చెప్పానంతే."

"అదే ఎందుకని అడుగుతున్నాను. పైకి చెప్పకపోయినాగానీ మునుపు నేనంటే నీకు ఇష్టమేనని నాకు తెలుసు."

"అది ఒకప్పటి సంగతి. ఇప్పుడు కాదు. ముహూర్తాలు పెట్టుకున్నాక అపూర్వగానీ కనిపిస్తే నీ మనసు మళ్ళీ మారిపోదన్న గ్యారంటీ కూడా లేదు. అపూర్వనే చేసుకుంటానని ఛాలెంజ్ చేసావు కూడా కదా" వ్యంగ్యంగా అంది.

"నా అభిమానినే చేసుకుంటానని ఛాలెంజ్ చేసాను కాబట్టే నువ్వు కాదంటున్నా, ఒప్పించటానికి ఇంతగా అవస్థపడుతున్నాను!" చిరునవ్వుతో అన్నాడు.

"అదేమిటీ...! అసలు..." అంటూ ఆశ్చర్యంతో సురేఖ ఏదో చెప్పబోతోంటే రవిచంద్ర పెద్దగా నవ్వుతూ అడ్డంవచ్చాడు.

"అంతగా ఆశ్చర్యాన్ని అభినయించకుగానీ... అదిగో 'అసలు' అనే ఆ మాటే అసలు సంగతిని నాకు తెలియచేసింది! మొదట ఆ ఉత్తరాన్ని చదివినప్పుడు నిజంగా ఎవరో రాసారుకాబోలనుకున్నా. కానీ ఇంకొసారి చదవగాననే అపూర్వవి నువ్వేనని అర్థమైపోయింది. నీ మాటలశైలి ఆ ఉత్తరంలో స్పష్టంగా కనుపిస్తోంది మరి! 'అసలు' అనే మాట నువ్వెక్కువగా ఉపయోగిస్తావుగా... ఆ ఉత్తరంలో కూడా నాలుగైదుసార్లు పైగా ఉంది. ఆ మధ్య వరంగల్ పక్కవూరి నుండి మీ ఫ్రెండు వచ్చిందిగా... ఆ అమ్మాయికి డిక్టేట్ చేసి రాయించి వరంగల్‌లో పోస్టు చేయమని చెప్పివుంటావని ఊహించాను.

ప్రశంసలు ఉత్సాహాన్ని కలిగిస్తాయి, నిజమే! కానీ నిజాయితీగా చేసే విమర్శలే మనం ఎదగటానికి ఉపయోగపడతాయని నాకూ తెలుసు. నువ్వు నా కథని విమర్శించినందుకు నువ్వనుకున్నట్లుగా నేనేం నిరుత్సాహపడలేదు. కాకపోతే తమాషాకి అలా మాట్లాడానంతే.

మా ఆఫీసు బ్రాంచిని వరంగల్‌లో ప్రారంభిస్తున్నాం. ఆ పనిమీద నేను ఉత్తరాలు రాస్తున్నప్పుడు నువ్వొచ్చావు. సరదాకి ప్రేమకథ చెబితే నువ్వు నమ్మేశావు. నా కథ ఇంకొకటి పబ్లిష్ అయినపుడు ఆ అమ్మాయే స్వయంగా వస్తానని రాసిందని నేను చెబితే ఆ తర్వాత నువ్వు మాటల్లో... అభినందన సుమమాల తీసుకవస్తానని చెప్పిందన్నావ్‌గా అని చెబుతూ దొరికిపోయావ్! ఆ ఉత్తరం నువ్వు చదవలేదు. అభినందన సుమమాల అనేమాట నీకు తెలిసిందంటే నువ్వు రాసిన ఉత్తరమే అదని రూఢి అయిపోయింది!

ఆ ఉత్తరానికి బాగా ఇంప్రెస్ అయి ప్రేమలో పడిపోయినట్లుగా మాట్లాడితే... నువ్వు థ్రిల్‌గా ఫీలయి "నేనే అపూర్వని" అని ఆనందంగా చెబుతావని ఎదురుచూశాను. కానీ నువ్వేమో ఆ మాట చెప్పకుండా నాకు దూరమైపోవాలని నిర్ణయించుకున్నా వెందుకనీ...?"

ముసిముసి నవ్వులు నవ్వింది. "మనిద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టమని తెలుసు. ఎవరో అమ్మాయి ప్రశంసలతో ముంచెత్తుతూ ఉత్తరం రాస్తే... ప్రేమలో పడ్డట్లుగా నువ్వు మాట్లాడితే ఏమనుకోనూ...? భవిష్యత్తులో గొప్ప రచయితగా పేరు సంపాదిస్తే... అభిమాని అయిన ఏ అమ్మాయైనా నీకు దగ్గర కావాలని ప్రయత్నిస్తే... నువ్వు తేలికగా ఆ ఆకర్షణలో పడిపోతావని నాకనిపించింది. అందుకే నీకు దూరంగా జరగటం మంచిదనుకున్నాను."

"ఇన్నేళ్ళ స్నేహంలో నా గురించి సరిగ్గా అంచనా వేయలేకపోయానని అనుకుని వుంటావు. మరి నన్ను వద్దనుకుంటే... పెద్దవాళ్ళు కుదిర్చిన సంబంధానికి అంగీకరించాలిగా! అతని మనస్తత్వం ఎలాంటిదో నీకేం తెలుస్తుందీ...?"

"నిజమే. తెలియదు. కానీ... ఒక చెఱువులో మొసలి ఉందని మనకి ఖచ్చితంగా తెలుసనుకో. ఆ పక్క చెఱువులో ఉందో, లేదో తెలియదు. నీళ్ళు కావలిసివస్తే అదృష్టాన్ని నమ్ముకుని రెండో చెఱువు దగ్గరికే వెళ్తాంగానీ మొదటిదాని దగ్గరకు వెళ్ళం కదా!"

రవిచంద్ర చిన్నగా నవ్వాడు. "నువ్వే అపూర్వవని నీ అంతట నువ్వుగా ఎప్పటికీ చెప్పకూడదను కున్నావా?"

"అదేం కాదు. నీ కథలో ఇతివృత్తం నాకు నచ్చకపోయినా శైలీ, సంభాషణలూ బావున్నాయి. బాగున్న విషయాలను చెప్పకుండా నచ్చని పాయింటునే విమర్శించి నీకు నిరుత్సాహం కలిగించానని ఫీలయ్యాను. అందుకే ఉత్తరం రాశాను. ఉత్సాహం తెచ్చుకుని నువ్వు నాలుగైదు కథలు రాశాక అప్పుడు ఈ విషయం చెబుదామనుకున్నా. కానీ నువ్వేమో ప్రేమంటూ మాట్లాడేసరికీ ప్రశంసలకి పడిపోయి మన స్నేహానికి విలువివ్వలేదని నాకు అభిమానంగా అనిపించింది. అందుకే నీకు చెప్పటం ప్రస్తుతం అనవసరమని పించింది" అంది సురేఖ తనూ నవ్వుతూ.

"నువ్వు రచయితగా నా అభిమానివి కాకపోవచ్చు. కానీ నన్నమితంగా అభిమానించే దానివి కాబట్టే మారు పేరుతో ఉత్తరం రాసి నాకుత్సాహం కలిగించాలని తాపత్రయపడ్డావు. అందుకే నేను నా అభిమానినే పెళ్ళిచేసుకుంటానని గట్టిగా నీకు చెప్పగలిగాను. రచయితగా కూడా నీ అభిమానాన్ని పొందటానికి కృషిచేస్తాను. సరేనా...! నా కథలు రెండింటిని ప్రచురణకు స్వీకరించినట్లుగా ఉత్తరాలు ఈ రోజు వచ్చాయి తెలుసా...!" అన్నాడు రవిచంద్ర ఆనందంగా నవ్వుతూ.

కాఫీ కప్పుతో వచ్చిన సురేఖ తల్లికి వాళ్ళిద్దర్నీ నవ్వు ముఖాలతో చూడగానే సమస్య తీరిందనే విషయం అర్ధమైంది... తేలికగా నిట్టూర్చింది.

జయం వీక్లీ. 1, జనవరి , 2003